క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌లో వాలిన ప్రేమజంట


పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

సదుం: కులాంతర వివాహం చేసుకున్న ఓ ప్రేమజంట పోలీసులను ఆశ్రయించింది. ఎస్‌ఐ షేక్‌షావలి కథనం మేరకు..సదుం మండలం మిట్టపల్లెకు చెందిన రాజేష్, రొంపిచెర్ల మండలానికి చెందిన లిఖిత ఉద్యోగరీత్యా బెంగళూరులో పని చేస్తున్నారు. వారి పరిచయం ప్రేమగా మారింది. అయితే ఇద్దరి కులాలు వేరు కావడంతో వారి ప్రేమను పెద్దలు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో పెద్దల అభీష్టానికి వ్యతిరేకంగా వారు వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. ఈనెల 8న చిత్తూరులో ఎస్పీని కలిసి తమకు పెద్దల నుంచి రక్షణ కల్పించాలని ఆశ్రయించారు. ఆయన సూచనల మేరకు సదుం పోలీస్‌స్టేషన్‌కు మంగళవారం వచ్చారు. రాజేష్ కుటుంబ సభ్యులకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు.

పశువులకు గాలికుంటు టీకాలు


టీకాలు వేస్తున్న సచివాలయ పశువైద్య సిబ్బంది

గుడుపల్లె: మండలంలోని పొగురుపల్లె గ్రామ పంచాయతీలోని చింతరపాళ్యం, కె.గొల్లపల్లె ,గ్రామాలలో పశువులకు మంగళవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పశు వైద్యాధికారులు వేశారు. గాలికుంటు వ్యాధి లక్షణాలు, పశువులు దాని బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పొగురుపల్లె సచివాలయ పశు వైద్య సిబ్బంది ఈ గ్రామాలలో 652 పశువులు, దూడలకు టీకాలు వేశారు.

మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డీఎల్‌డీఓ వెంకటశేషయ్య.

పెద్దపంజాణి: మరుగుదొడ్ల ఆవశ్యకతపై మండలంలోని రాయలపేట, కోగిలేరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి(డీఎల్‌డీఓ), మండల ప్రత్యేకాధికారి వెంకటశేషయ్య అవగాహన కల్పించారు. ఆరుబయట మలవిసర్జన చేయడం వలన రోగాలు వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని కోరారు. అనంతరం స్కూళ్లలో సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులు తెలిపిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ బాబు, పీఎస్ సుజాత, హెచ్‌ఎం లోకేష్, ఎంఈఓ సుధాకర్ పాల్గొన్నారు.

'రిమ్మర్స్' ప్రిన్సిపాల్‌కు సన్మానం


:ప్రిన్సిపాల్ తనూజను సన్మానిస్తున్న దృశ్యం

పలమనేరు: పట్టణ సమీపంలోని నడింపల్లి రిమ్మర్స్ బుద్ధిమాంద్యం స్కూల్ ప్రిన్సిపాల్ తనూజ అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ మంగళవారం పట్టణానికి చెందిన శ్రీ సీతారామాంజనేయస్వామి భక్తిమండలి నిర్వాహకులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఉప్పుశెట్టి కుమారమ్మ, ప్రేమలీల, వాణి మాట్లాడారు. ఇక్కడి బడిలోని 65మంది బుద్ధిమాంద్యం పిల్లలకు సేవలందించడం ఆషామాషీ కాదన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన పిల్లల ఆలనా, పాలనా చూస్తూ, విద్యాబుద్ధులు నేర్పుతున్న తనూజకు ఈ పిల్లలకో తల్లిగా మారిందని ప్రస్తుతించారు. పిల్లలకు భక్తిమండలి నిర్వాహకులు అన్నదానం చేశారు. సంస్థ నిర్వాహకులు డాక్టర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

చౌడేపల్లె: బోయకొండ అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. తమకు అందిన రహస్య సమాచారం మేరకు దాడులు చేయగా.. బండ్లపైకు చెందిన వెంకటేష్ తప్పించుకుని పరారయ్యాడని, నిమ్మనపల్లె మండలం బండ్లపైకు చెందిన లోకేష్,. ఈరనాల శ్రీనివాసులు, గాండ్ల శ్రీనివాసులు, గణేష్, దిగువపల్లె ఆర్‌ఆర్ కాలనీకి చెందిన వై.గణేషను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.5,560 స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

పలమనేరు- వీకోట రోడ్డులో బురిశెట్టిపల్లె వద్ద ఉలవ పంట ఒబ్బిళ్లు



పలమనేరు- బైరెడ్డిపల్లె మార్గంలో రోడ్డుపై నూర్పిడి చేసి ధాన్యాన్ని రోడ్డుపై ఎండకేసిన దృశ్యం (ఫైల్)



రోడ్లపై పంట నూర్పిళ్లు..!

- తప్పని రోడ్డు ప్రమాదాలు!
- గ్రామాల్లోని కానరాని రాతిబండల కొటార్లు
- నిరుపయోగమైన సిమెంట్ కొటార్లు
- రోడ్లపైనే పంటలను నూర్పిడి చేసుకుంటున్న రైతులు

పలమనేరు: నియోజక వర్గంలోని జాతీయ రహదారులు, రాష్ట్ర రోడ్లు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీల తారు రోడ్లులో పంట నూర్పిళ్లు ఈ మధ్యకాలంలో ఎక్కువయ్యాయి. దీంతో రాత్రి వేళ వాహనచోదకులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన హైవే, పీఆర్, ఆర్ అండ్‌బీ అధికారులు అస్సలు పట్టించుకోవడం లేదు. ఫలితంగా రోడ్డుపై ఎక్కడ నూర్పిళ్లు చేస్తున్నారో తెలియని వాహనచోదకులకు ప్రమాదాలు పలకరిస్తున్నాయి.

గతంలో రాతి కొటార్లు

గతంలో పల్లెల్లోని పంటల ఒబ్బిడి కోసం రాతి బండలపై కొటార్లుండేవి. అయితే కాలక్రమేణా వీటిని రైతులు ఉపయోగించడం లేదు. కొన్ని బండలను బ్లాస్ట్ చేసి వీటి ఉనికి లేకుండా చేశారు. దీంతో రైతులు సులభంగా ఒబ్బిడి కోసం తారురోడ్లలో పంటను వేసి రోడ్డుపై రాకపోకలు చేసే వాహణాలు వాటిని టైర్లతో తొక్కడం ద్వారా నూర్పిడి సులభతరమవయతుందని రోడ్లపై వేస్తున్నారు.

హైవేల్లోనే ఎక్కువగా...

నియోజకవర్గంలో పలమనేరు నుంచి వీకోట దాకా ,పెద్దపంజాణి, గంగవరం మండలాల మీదుగా,అనంతపురం–క్రిష్ణగిరి హైవే వెళుతోంది. ఇక చెన్నై–బెంగళూరు హైవే పలమనేరు, గంగవరం మండలాల మీదుగా వెళుతోంది. దీంతో పాటు పలు గ్రామాలకు వెళ్లే రాష్ట్ర రహదారులైన పలమనేరు- గుడియాత్తం రోడ్డు, కడపనత్తం- పుంగనూరు, కొలమాసనపల్లె–నెల్లిపట్ల, వీ.కోట- పేర్నంబట్ రోడ్లున్నాయి. ఆయా గ్రామాలకు సమీపంలోని రోడ్లపై ప్రస్తుతం రైతులు ఉలవ పంట ఒబ్బిడి చేస్తున్నారు. ఇక వరిపంట ఒబ్బిడి సమయంలో వరిని తారు రోడ్డుపై ఎండబెట్టడం, పశుగ్రాసాన్ని తొక్కించడం.. లాంటివి చేస్తూ రోడ్డుపై వాటి చుట్టూ రాళ్లను పెడుతుంటారు. ఇది తెలియక రాత్రిపూట ప్రయాణించే మోటార్ సైక్లిస్టులు వాటి మూలాన ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ పర్యాయం ఉలవ సీజన్‌లోనే నియోజకవర్గంలో పది వరకూ జరిగిన మైనర్ రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు.

గతంలో ఉపాధి పథకం కింద వేసిన కొటార్లు

గత టీడీపీ ప్రభుత్వంలో పంచాయతీల పరిధిలో రైతులకు సౌకర్యవంతమైన చోట ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి రూ.లక్ష ఉపాధి నిధులతో సిమెంట్ కొటార్లను నిర్మించారు. అయితే వీటికి బిల్లులయ్యాక వీటి జాడ కనిపించకుండా పోయింది. కొన్ని గ్రామాల్లో ఇవి ఉన్నప్పటికీ వీటిని రైతులు ఉపయోగించకపోవడంతో నిరుపయోగమయ్యాయి. ఇప్పటికైనా రోడ్లపై పంట నూర్పిళ్లు చేయకుండా సంబంధిత అధికారులు కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే, రైతులకు గతంలో నిర్మించిన సిమెంట్ కొటార్లను వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ఈజీఎస్ అధికారులపై ఉంది.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

గంగవరం: మండలంలో అర్హత గల బీసీ, కమ్మ, రెడ్డి, కాపు, ఈబీసీ, ఆర్య వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియుల మహిళలకు ప్రాథమిక టైలరింగ్‌పై శిక్షణ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోందని ఎంపీడీవో సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.2024–25 సంవత్సరానికి సంబంధించి వార్షిక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాలను మహిళా దినోత్సవం రోజున ప్రారంభించినట్టు తెలిపారు. మహిళా సాధికారత కింద టైలరింగ్‌పై శిక్షణ ఇవ్వడం కోసం ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నియోజకవర్గంలో 3 నుంచి 4 శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దీనికి ఆసక్తి కలిగిన 18 నుంచి 50 ఏళ్ల లోపు మహిళలు తమ గ్రామ సచివాలయాల్లో ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పాడి ఆవు చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

గంగవరం: పాడి ఆవు చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు మంగళవారం గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం..మండలంలోని కూర్నిపల్లెలో పాడి రైతు శివకుమార్‌కు చెందిన పాడి ఆవు రెండు రోజులు క్రితం చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పెద్దపంజాణి మండలం చలమంగళం గ్రామానికి చెందిన సహదేవ ఆవును చోరీ చేసినట్లు తేలింది. అతడిని పంజాణి పెట్రోల్‌బంక్ వద్ద అదుపులోకి తీసుకుని ఆవును స్వాధీనం చేసుకున్నారు.

'గురుకులం'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సదుం: మండలంలోని మహాత్మా జ్యోతీబా పూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కన్వీనర్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి మంగళవారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ఇక్కడ ఉన్నాయన్నారు. అలాగే 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 15 లోపు http:// mjpapbcwreis. apcfss. in లో దరఖాస్తు చేయాలన్నారు.

మోహిని అవతారంలో శ్రీవారి విహారం

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద ఉన్న శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామిని బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి గరుడ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు ఆధ్వర్యంలో హిందూ ధార్మిక సంస్థల సభ్యులు గరుడ వాహనసేవకు పట్టణంలోని తూర్పు మొగశాల వద్ద శ్రీచాముండేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి బంగారు నగలు, వెండికాసులతో పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఆలయానికి చేరుకుని స్వామివారికి పూజలు చేశారు. ఆలయం భక్తుల గోవిందనామస్మరణతో మార్మోగింది.


మోహిని అవతారంలో శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి

చెత్త సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

–డీపీఓ సుధాకర్‌రావు

చౌడేపల్లె: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు ఆదేశించారు. మంగళవారం చౌడేపల్లె చెత్త సేకరణ కేంద్రం వద్ద పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చౌడేపల్లెలో నిరుపయోగంగా ఉన్న కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో ప్రస్తుతం ప్రయోగాత్మకంగా శ్రీకారం చుట్టిన చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఏ విధంగా చెత్త సేకరించాలి? వర్మీ కంపోస్ట్ పిట్‌లలో చెత్తను ఎలా నింపాలి? తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రతి పంచాయతీలోని చెత్త సేకరణ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చి వర్మీ కంపోస్టు తయారీతో ఆదాయం పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో డీపీఆర్సీ షణ్ముగం,సర్పంచ్ వరుణ్ భరత్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఓ సుధాకర్‌రావు

నాగిరెడ్డిపల్లెలో గంగరాళ్ల ప్రతిష్ఠ

– హాజరైన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లె: మండలంలోని కొండామర్రి పంచాయతీ నాగిరెడ్డిపల్లెలో మంగళవారం గంగరాళ్ల ప్రతిష్ఠాపన భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై గంగరాళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ గంగరాళ్లకు హారతిచ్చారు. అలాగే నడుమూరులోని వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి నివాసంలో నవ వధూవరులను, అనంతరం దేవరగుడిపల్లె మరో జంటను ఆయన ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు , జెడ్పీటీసీ దామోదరరాజు, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మిద్దింటి కిషోర్‌బాబు, నాగభూషణరెడ్డి, కళ్యాణ్ భరత్, వెంకటరమణ, షంషీర్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

'యువత పోరు' విజయవంతం చేద్దాం

- కూటమి ప్రభుత్వం తీరును ఎండగడుదాం
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుల పిలుపు
- నేడు చిత్తూరులో అమూల్ డెయిరీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ

వి.కోట/సదుం/పులిచెర్ల(కల్లూరు)/రొంపిచెర్ల/గుడుపల్లె: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చిత్తూరులో బుధవారం నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సదుం జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ధనుంజయరెడ్డి, పులిచెర్ల ఎంపీపీ సురేంద్రనాధరెడ్డి, మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వత్ బాషా, రొంపిచెర్ల ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, గుడుపల్లె మండల పార్టీ కన్వీనర్ రామకృష్ణ పిలుపునిచ్చారు. యువతపోరు పోస్టర్లను మంగళవారం వారు ఆవిష్కరించారు. విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా ఇంత వరకు పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తోందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన విద్యాదీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన తదితర పథకాలు అమలు చేయకుండా విద్యార్థుల భవితను అంధకారంలోకి నెట్టి వేస్తోందని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చింది మొదలు ఏ వర్గానికీ న్యాయం చేసిన పాపానపోలేదన్నారు. 9 నెలలకే ఉద్యోగులు, అంగన్‌వాడీ, సంఘమిత్రలు ఆందోళన బాట పట్టారన్నారు. ప్రభుత్వం తీరును ఎండగట్టేందుకు, విద్యార్థులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో చేస్తున్న పోరుకు పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, అన్ని అనుబంధ విభాగాల నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, యువత హాజరు కావాలని కోరారు. తొలుత చిత్తూరులోని అమూల్ డెయిరీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, ఇమ్రాన్, పుత్రాజు, మదన్‌మోహన్ రెడ్డి, రమణారెడ్డి, కృష్ణారెడ్డి, రామకొండారెడ్డి, ఎల్లారెడ్డి, బావాజి, మునీంద్ర, రవి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కోటా వెంకటరమణ, రొంపిచెర్ల మండల కన్వీనర్ చెంచురెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.


సదుం: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

జోగివారిపల్లె రోడ్డుకు మరమ్మతులు

సదుం: మండల కేంద్రం నుంచి జోగివారిపల్లెకు ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆ మార్గంలో పలు చోట్ల కల్వర్టులు నిర్మించి రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకున్నారు. ఇంతలో ఎన్నికలు రావడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఎన్నికల అనంతరం అధికారులు ఈ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోకపోవడంతో గోతుల దారిలో ప్రయాణించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై సాక్షిలో కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన అధికారులు చర్యలకు పూనుకున్నారు. ప్రస్తుతం గోతులు ఉన్న చోట మాత్రం వాటిని పూడ్చుతున్నారు. పూర్తి స్థాయిలో రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలని ఆ మార్గంలో ప్రయాణించే గ్రామస్తులు కోరుతున్నారు.


జోగివారిపల్లె రోడ్డులో చేస్తున్న మరమ్మతులు

క్యాట్‌ఫిష్ అమ్మకాలపై దాడులు

పలమనేరు: నిషేధిత క్యాట్‌ఫిష్ విక్రయాలపై స్థానిక మున్సిపల్ అధికారులు పట్టణంలోని చేపల మార్కెట్‌లో మంగళవారం దాడులు చేశారు. వీటిని విక్రయిస్తున్న వ్యాపారులకు తొలి తప్పుగా జరిమానా విధించారు. ఆరోగ్యానికి హాని కలిగించే ఈ చేపలను విక్రయించకూడదని హెచ్చరిస్తున్నా రహస్యంగా తెచ్చి విక్రయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరికొన్ని దుకాణాల్లో వాడుతున్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి రూ.3,500 జరిమానా విధించినట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.


చేపల దుకాణాల వద్ద తనిఖీలు చేస్తున్న అధికారులు

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

పలమనేరు: పంచాయతీరాజ్ వ్యవస్థాపక ఉద్యోగ సంఘ పలమనేరు సమితి అధ్యక్షుడిగా రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఏపీఎన్జీవోస్‌లో ఎన్నికల అధికారి అలీ ఆధ్వర్యంలో మంగళవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గాయత్రి, కార్యదర్శిగా ఇంతియాజ్, ట్రెజరర్‌గా కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఉషారాణి, జిల్లా కౌన్సిలర్‌గా లక్ష్మీపతి తదితరులు ఎంపికయ్యారని ఆయన తెలిపారు.

864 మద్యం ప్యాకెట్ల స్వాధీనం

- ముగ్గురి అరెస్టు

కుప్పం: కుప్పం – పలమనేరు జాతీయ రహదారిలో వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్న 864 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ నాగరాజు తెలిపారు. పోలీసులు మంగళవారం గణేష్‌పురం వద్ద తనిఖీలు చేస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలు వేగంగా రావడంతో ఆపి తనిఖీ చేశారు. ఈ వాహనాల్లో కర్ణాటక మద్యం బాక్సులు ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటిని పరిశీలించ గ్గా 864 మద్యం ప్యాకెట్లు ఉన్నట్టు తేలింది. మద్యం అక్రమ రవాణా చేస్తున్న గణేష్‌పురం గ్రామానికి చెందిన దేవేంద్ర, పన్నీరుసెల్వం, కదిరవన్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది చలపతి, రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై రైతులకు శిక్షణ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని రైతులకు పులిచెర్ల రైతు సేవా కేంద్రంలో వివి ధ అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు సోమవారం వ్యవసాయాధికారి ఏఓ హరిప్రసాద్ తెలిపారు. పంటల సమాచారాన్ని స్కిల్ ఆఫ్ చిత్తూరు యాప్‌లో నమోదు చేస్తారని, తద్వారా పంటల సమాచారం, వాతావరణ వివరాలు తెలుసుకోవడంతోపాటు పంటలను ఆశించే చీడలపీడల నివారణకు తగు చర్యలు తీసుకోవచ్చన్నారు. ఈ యాప్ గురించి సహచార రైతులకు తెలియజేయాలని కోరారు. అంతేకాకుండా డిజిటల్ శిక్షణ బాగా ఇచ్చిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.20వేలు, రూ.12వేలు, రూ.8వేలను కలెక్టర్ ప్రదానం చేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీ విజయశంకరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


హాజరైన రైతులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది

ప్రభుత్వ స్కూళ్లలోనే పిల్లలను చదివించాలి

రొంపిచెర్ల: ప్రభుత్వ స్కూళ్లలోనే పిల్లలను తల్లిదండ్రులు చదివించాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి కోరారు. మంగళవారం రామచంద్రాపురం కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలానికి ఈ విద్యా సంవత్సరం నుంచి మూడు మోడల్ స్కూళ్లు ప్రారంభం అవుతాయని, అలాగే అదనంగా ఆరుగురు ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమిస్తుందన్నారు. నాణ్యమైన విద్య ప్రభుత్వం స్కూళ్లలోనే సాధ్యమని, దీనిని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, కార్యదర్శి హరిబాబు, సచివాలయ ఉద్యోగులు రేష్మా, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి

నేడు మార్కెట్ల వేలం

శాంతిపురం:మండలంలోని బడుగుమాకులపల్లె వారపు సంతలో గేటు వసూలు హక్కుల కోసం బుధవారం ఉదయం 10 గంటలకు పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్టు స్థానిక సర్పంచ్ ఏవీ జయరాం, కార్యదర్శి అశ్వత్థనారాయణ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వారపు సంత అంగళ్లకు, పశువుల సంతకు, ఆటోలు–ప్రైవేటు వాహనాలకు, గొర్రెలు–కోళ్ల సంతకు ఒక్కో దానికి రూ 2లక్షలతో పాటు రూ.4 లక్షల సాల్వెన్సీ పొందుపరచాలని కోరారు.